సాక్షి
మంచిర్యాల
సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



పది రోజుల్లో ఛేదించారు! 8లో▸

చెన్నూర్‌లోని ఎస్‌బీఐలో జరిగిన రూ.13.71 కోట్ల భారీ మోసాన్ని పోలీసులు పది రోజుల్లో ఛేదించారు. 15.23 కిలోల ఆభరణాలు, రూ.1.61 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా అనిత



మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీశ్ రాజ్ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనితకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు అప్పగిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రెగ్యులర్ డీఎంహెచ్‌వో వచ్చే వరకు అనిత కొనసాగుతారని పేర్కొంది. అనిత ఇమ్యూనైజేషన్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తూ, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కొనసాగనున్నారు.

గరిష్టం/కనిష్టం
29.5 /25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

న్యాయశాఖ ఉద్యోగుల కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

మంచిర్యాలక్రైం: న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలు ఆదివారం కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. ఎన్నికల కమిషనర్‌గా ఎండీ.ఇంతియాజ్, అసిస్టెంట్ కమిషనర్‌గా విజయ్‌కుమార్ వ్యవహరించారు. ఉద్యోగులు 164 మంది ఓటర్లు ఉండగా, 157 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా అగ్గర్సు రాజగోపాల్, ఉపాధ్యక్షులుగా ఎం.రజనీకాంత్‌రావు, ఎం.మనోహర్, సీహెచ్.మాధవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. జనరల్ సెక్రెటరీగా కె.మంజుల, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎస్.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. జాయింట్ సెక్రెటరీగా జి.చిన్నయ్య, కె.సుగుణాకర్ ఎన్నికయ్యారు.

3న ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో పులిమడుగులోని హెవెన్ ఆఫ్ హోప్ హైస్కూల్‌లో ఈనెల 3న అండర్–14, 17 బాలబాలికలకు ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య, ఎస్జీఎఫ్ కార్యదర్శి యాకూబ్ తెలిపారు. పూర్తి వివరాలకు టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శి సురేందర్‌ను 85198 78452 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు



స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసే బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలుపడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఆదివారం బాణసంచా కాల్చి, స్వీట్లు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. చారిత్రాత్మక బిల్లును పెట్టిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఒడ్డె రాజమౌళి, నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ వేణు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామగిరి బానేష్, పెంట రజిత, మాజిద్, సదానందం, మాదంశెట్టి సత్యనారాయణ, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

దేవాపూర్‌లో విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో సత్యపాల్‌రావు, నాయకులు

కాసిపేట: ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కొక్కిరాల సత్యపాల్‌రావు ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కుమురంభీం విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీ ప్రారంభించారు. మహిళలు సత్యపాల్‌రావుకు స్వాగతం పలికారు. ఆదివాసీలు డప్పు చప్పుళ్లతో, సంప్రదాయ నృత్యాలు చేశారు. కార్మికులు, స్థానికుల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్



పోటీలు ప్రారంభిస్తున్న ఏసీపీ రవికుమార్

మందమర్రిరూరల్: మార్షల్ ఆర్ట్స్ ఆత్మరక్షణకు తోడ్పడుతుందని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ రాష్ట్రస్థాయి కరాటే, కుంగ్‌ఫూ రెండో చాంపియన్‌షిప్ పోటీలను ఎస్సై రాజశేఖర్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని సూచించారు. పోటీల్లో 28 జిల్లాల నుంచి సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు, ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి కనపర్తి రమేశ్, గ్రాండ్ మాస్టర్ కంటేష్, ఆల్‌స్టైల్ కుంగ్‌ఫూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు హరికృష్ణ, సీనియర్ మాస్టర్లు రమేశ్‌రాజా, ప్రసాద్, కుందేళ్ల రవి, వెంకటేశ్, రామ్మోహన్, శేఖర్, సర్వేష్, నాగలక్ష్మి, కోచ్‌లు పాల్గొన్నారు.

స్థానిక హడావుడి



మంచిర్యాల జిల్లా పరిషత్ కార్యాలయం(ఫైల్)

మంచిర్యాల జిల్లాలో ప్రాదేశిక, పంచాయతీల వివరాలు...

జెడ్పీ	జెడ్పీటీసీలు	ఎంపీపీలు	ఎంపీటీసీలు	సర్పంచ్	వార్డులు
1	16	16	129	306	2,680

ముసాయిదా ఓటర్ల జాబితా ఇలా..

మహిళలు	1,91,011
పురుషులు	1,85,643
ఇతరులు	15
మొత్తం ఓటర్లు	3,76,669
బ్యాలెట్ బాక్సులు	4,278
పంచాయతీ పోలింగ్ స్టేషన్లు	2,680
పరిషత్ పోలింగ్ స్టేషన్‌లు	714

- రేపు పంచాయతీల తుది ఓటర్ల జాబితా
- తాజాగా పరిషత్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల షెడ్యూల్
- ముందు ప్రాదేశికం.. తర్వాత పంచాయతీ ఎన్నికలు.!

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక సంస్థల ఎన్నికలకు త్వరలో నగారా మోగనుంది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా తయారీ ప్రక్రియ పూర్తయింది. సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాలతో రాజకీయం వేడెక్కింది. ముసాయిదా ఓటరు జాబితా విడుదల, ఫొటో ఓటరు జాబితా ప్రదర్శన షెడ్యూల్‌తోపాటు ఎన్నికల సన్నాహాలు పూర్తయ్యాయి.

పంచాయతీ ఎన్నికలకు సన్నాహాలు..

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 16 మండలాల్లో 306 గ్రామ పంచాయతీలు, 2,730 వార్డులు ఉండగా, మొత్తం 3,76,669 మంది ఓటర్లు నమోదైనట్లు తెలుస్తోంది. బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయి. సెప్టెంబర్ 2న ఫొటో ఓటరు జాబితా ప్రదర్శనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

'పరిషత్' ఓటరు జాబితా షెడ్యూల్..

మండల పరిషత్ (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ (జెడ్పీటీసీ) ఎన్నికలకు సంబంధించి ముసాయిదా ఓటరు జాబితా సెప్టెంబర్ 6న మండల, జిల్లా పరిషత్ కార్యాలయాలతోపాటు పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శితమవుతుంది. సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. సెప్టెంబర్ 8న జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అభ్యంతరాలను పరిశీలిస్తారు. 9న అభ్యంతరాల పరిష్కారం ఉంటుంది. 10వ తేదీన తుది ఫొటో ఓటరు జాబితా ప్రదర్శిస్తారు. జిల్లాలో 16 జెడ్పీటీసీ స్థానాలు, 129 ఎంపీటీసీ స్థానాలు ఖరారైనట్లు అధికారులు ప్రకటించారు.

రాజకీయ సందడి..

స్థానిక ఎన్నికల తేదీలు దగ్గరపడుతుండటంతో రాజకీయ పార్టీలు, ఆశావాహుల్లో ఉత్సాహం నెలకొంది. అధికార పార్టీతోపాటు బీఆర్‌ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీలు ఎన్నికల సన్నద్ధతలో నిమగ్నమయ్యాయి. గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. పరిషత్ ఎన్నికల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పాన్ ఇండియా సంస్థగా సింగరేణి

- సీఎండీ బలరాంనాయక్



ప్రమాణం చేయిస్తున్న సీఎండీ బలరాంనాయక్



బహుమతి అందుకున్న ఎస్సార్పీ ఓసీ-2 ఉద్యోగులు

రామకృష్ణాపూర్: సింగరేణి సంస్థకు కొత్త బొగ్గు గనులు కేటాయించకుంటే సంస్థ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని సంస్థ సీఅండ్ఎండీ బలరాంనాయక్ అన్నారు. అభివృద్ధి పథంలో పయనిస్తున్న సింగరేణి ప్రస్తుతం పాన్ ఇండియా సంస్థగా మారిందని తెలిపారు. సింగరేణి 55వ రక్షణ పక్షోత్సవాల బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమం మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలోని ఎంఎస్‌ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి డీజీఎంఎస్ ఉజ్వల్‌థాతో కలిసి సీఎండీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బలరాంనాయక్ మాట్లాడుతూ తెలంగాణతోపాటు ఒడిశా, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు సింగరేణిని విస్తరించిందని తెలిపారు. విదేశాల్లోనూ సంస్థ ఖ్యాతిని ఇనుమడింపజేసేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంస్థ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటూనే గని కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సింగరేణి కార్మికులకు దసరా అడ్వాన్స్, దీపావళి బోనస్ సకాలంలో అందేలా చూస్తామన్నారు. ఉత్పత్తి కన్నా సంస్థకు కార్మికుల ప్రాణాలు ముఖ్యమని తెలిపారు. రక్షణ విషయంలో రాజీపడొద్దని సూచించారు. కొన్ని కారణాలతో బొగ్గు గనుల వేలంలో ఇప్పటివరకు పాల్గొనలేకపోయామని, ఇకపై వేలంలో పాల్గొంటామని చెప్పారు.

ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలి..

బొగ్గు ఉత్పత్తిలో దూసుకుపోతున్న సింగరేణిని పూర్తిగా ప్రమాదరహిత సంస్థగా తీర్చిదిద్దాలని డైరెక్టర్ జనరల్ మైన్స్ సేఫ్టీ ఉజ్వల్ థా అన్నారు. సేఫ్టీ విషయంలో నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెలిపారు. మైనింగ్ రంగంలోకి మహిళా ఉద్యోగులు రావటం శుభసూచకమని పేర్కొన్నారు. ఎక్కువ శాతం ప్రమాదాలు పనిలో అప్రమత్తంగా లేని కారణంగానే జరుగుతున్నాయన్నారు. పనితీరు మెరుగుపర్చుకుంటూ ప్రమాదాలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

రక్షణ త్రైపాక్షిక సమావేశం..

సింగరేణిస్థాయి 49వ రక్షణ త్రైపాక్షిక సమావేశం ఆదివారం ఉదయం నిర్వహించారు. ఇందులో సింగరేణిలోని అన్ని ఏరియాల జీఎంలు, డైరెక్టర్లు, సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. రక్షణ విషయంలో రాజీపడొద్దని డీజీఎంఎస్ సూచించారు. మరోవైపు మారుపేర్లు క్రమబద్ధీకరించాలని ఎంఎస్‌ఆర్ గార్డెన్ వద్ద బాధితులు నిరసన తెలిపారు. సీఎండీ స్పందిస్తూ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ కన్నన్, సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణ, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గౌతం, గుర్తింపు సంఘం అధ్యక్షుడు సీతా రామయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, జీఎం సేఫ్టీ కార్పొరేట్ చింతల శ్రీనివాస్, సీఎంవోఏఐ అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఆట'ంకం తొలగేనా..!

- పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యం
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో ఊరట
- కాంట్రాక్టు పద్ధతిన వ్యాయామ ఉపాధ్యాయులు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు(ఫైల్)

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా చాలా ముఖ్యం. ఇవి శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందించడమే కాకుండా, రోజువారీ వ్యాయామం ద్వారా విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంట్రాక్టు విధానంలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలని ప్రకటించడం విద్యార్థులతోపాటు నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురింపజేస్తోంది. అయితే, అనేక పాఠశాలల్లో క్రీడా మైదానాల కొరత, ఆటల పీరియడ్ లేకపోవడం, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో జాప్యం వంటి సమస్యలు విద్యార్థులను క్రీడలకు దూరం చేస్తున్నాయి.

క్రీడా మైదానాల కొరత..

జిల్లాలో మొత్తం 1,078 పాఠశాలల్లో 1,27,568 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో 724 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 33,425 మంది, 136 రెసిడెన్షియల్, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో 26,568 మంది, 223 ప్రైవేట్ పాఠశాలల్లో 67,292 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే, కేవలం 646 పాఠశాలల్లోనే క్రీడా మైదానాలు ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. చాలా ప్రైవేట్ పాఠశాలలు అద్దె భవనాల్లో నడుస్తుండటంతో క్రీడా స్థలాలు లేవు. కార్పొరేట్‌స్థాయి పాఠశాలల్లో సైతం మైదానాలు అరుదుగా కనిపిస్తాయి. వార్షికోత్సవాలు, స్వాతంత్య్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా మినహా, మిగిలిన సమయాల్లో క్రీడలు నిర్వహించడం లేదు.

వ్యాయామ ఉపాధ్యాయుల కొరత..

జిల్లాలో 104 ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 48 మంది ఫిజికల్ డైరెక్టర్లు (పీడీలు), 4 మంది ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (పీఈటీలు) పనిచేస్తున్నారు. తెలంగాణ మోడల్ స్కూళ్లలో 5 మంది, కేజీబీవీలలో 18 మంది కాంట్రాక్టు వ్యాయామ ఉపాధ్యాయులు, అదనంగా 14 మంది పార్ట్‌టైమ్ పీఈటీలు విధులు నిర్వహిస్తున్నారు. అయితే, టేకులబస్తీ, భీమిని మండల్ వెంకటపూర్, రామకృష్ణాపూర్ బాలికల పాఠశాల, కుందారం, తాళ్లగురిజాల వంటి పాఠశాలల్లో పీఈటీ పోస్టులు మంజూరైనా భర్తీకి నోచుకోలేదు. 488 ప్రాథమిక పాఠశాలలు, 95 అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేక క్రీడలు నిర్వహించడం లేదు. ప్రైవేట్ పాఠశాలల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు, ట్యూషన్లు, హోంవర్క్‌లకే విద్యార్థులను పరిమితం చేయడంతో క్రీడలపై ఆసక్తి తగ్గుతోంది.

ప్రభుత్వ పాఠశాలలకు నిధులు

ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వం క్రీడా పరికరాల కొనుగోలు కోసం ఉన్నత పాఠశాలలకు రూ.25 వేలు, అప్పర్ ప్రైమరీ పాఠశాలలకు రూ.15 వేలు, ప్రాథమిక పాఠశాలలకు రూ.10 వేల చొప్పున నిధులు మంజూరు చేసింది. దీంతో క్యారమ్, చెస్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, టెన్నిస్‌బాల్ వంటి క్రీడా సామగ్రిని కొనుగోలు చేశారు. ప్రతీ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల నియామకంతో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం విద్యార్థులు, నిరుద్యోగ వ్యాయామ ఉపాధ్యాయుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది.

క్రీడలకు ప్రాధాన్యం హర్షణీయం..



ప్రభుత్వం క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇస్తానని ప్రకటించం శుభ పరిణామం. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పీఈటీ, పీడీ పోస్టులు రెగ్యులర్ ప్రాతిపాదికన నియమించాలి. క్రీడల్లో విద్యార్థులు చక్కగా రాణించి జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కుతుంది. – రేణి రాజయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి..



ప్రతీ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిని నియమించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. పాఠశాలస్థాయి నుంచి విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెరుగుతుంది. క్రీడలకు ప్రాధాన్యతలో భాగంగా ప్రభుత్వం ఏటా సీఎం కప్ నిర్వహిస్తుంది. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీల్లో రాణించే క్రీడాకారులకు క్యాష్ అవార్డు ఇస్తోంది. క్రీడాపరికరాలకు అవసరమైన నిధులు కేటాయిస్తుంది. ఎస్జీఎఫ్ పోటీల నిర్వహణకు వేదికలు ఖరారయ్యాయి. – ఎండీ.యాకూబ్, ఎస్జీఎఫ్ కార్యదర్శి

శాంతించిన గోదావరి



వేలాల కుళ్లిపోయిన పత్తి పంట

- వరదతో వందల ఎకరాల్లో పంట నష్టం
- ఆందోళనలో అన్నదాత

జైపూర్/కోటపల్లి/చెన్నూర్‌రూరల్/దండేపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా గోదావరి నది మూడు రోజులు ఉగ్రరూపం దాల్చింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నదీ తీరంలోని పంటలు పూర్తిగా నీటమునగడంతో దెబ్బతిన్నాయి. జైపూర్, కోటపల్లి, చెన్నూర్ మండలాల్లోని గ్రామాల్లోని నది తీర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఆదివారం నది కొంత శాంతించింది. కుళ్లిపోయిన పంటలను చూసి రైతుల కన్నీటిపర్యంతమవుతున్నారు.

జైపూర్ మండలంలో..

మండలంలోని కుందారం, రొమ్మిపూర్, కిష్టాపూర్, వేలాల, గోపాల్‌పూర్, శివ్వారం గ్రామాల్లో గోదావరి తీరంలోని పంటలు నాలుగు రోజులపాటు వరద నీటిలో మునిగాయి. ఈ ప్రాంతాల్లో పత్తి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వేలాల గ్రామంలో బ్యాక్‌వాటర్ చేరడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వరద ఉధృతి తగ్గడంతో నీరు క్రమంగా నదిలోకి వెళ్లినప్పటికీ పంట నష్టపోయిన రైతులు ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

కోటపల్లిలో మూడోసారి..

కోటపల్లి మండలంలో గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగడంతో ఎర్రాయిపేట, కొల్లూర్, రాంపూర్, దేవులవాడ, లక్ష్మీపూర్ గ్రామాల్లో పత్తి చేలల్లోకి వరద నీరు చేరింది. ఈ సీజన్‌లో మూడోసారి వరదలు సంభవించడంతో రైతులు కోలుకోలేని నష్టాన్ని చవిచూశారు. పంటలు సగం వరకు మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే సర్వే నిర్వహించి పరిహారం అందించాలని కోరుతున్నారు.

చెన్నూర్‌లో కుళ్లిన పత్తి చేలు..

చెన్నూర్ మండలం బీరెల్లి, చింతలపల్లి, నారాయణపూర్, పొక్కూరు, సుందరసాల గ్రామాల సమీపంలో బ్యాక్‌వాటర్ ప్రభావంతో పత్తి పంటలు నీటమునిగాయి. వరద ఉధృతి తగ్గిన తర్వాత పత్తి మొక్కలు నల్లబడి, పనికిరాని స్థితికి చేరాయి.

దండేపల్లి మండలంలో..

దండేపల్లి మండలంలో గోదావరి ఉధృతికి మూడు రోజులు పంటలు నీటిలోనే ఉన్నాయి. దీంతో మొక్కలు కుళ్లిపోయాయి. నష్టపోయిన పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రాళ్లవాగుతోనే ముంపు

- ఏటా వానాకాలంలో మునుగుతున్న మంచిర్యాల
- చినుకు పడితే వణుకుతున్న పలు కాలనీలు..
- వర్షం పడకున్నా ఎగువప్రాంత వరదలతో ముప్పు



మంచిర్యాలలో ఇళ్ల మధ్యలోకి వరద

మంచిర్యాలటౌన్: నాలుగేళ్లుగా వర్షాకాలంలో మంచిర్యాల నగరంలోని పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. జిల్లాలో భారీ వర్షాలు లేకపోయినా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా శ్రీరామ్‌సాగర్, కడెం ప్రాజెక్టులు నిండి, వరద గోదావరికి పోటెత్తుతోంది. దీంతో నగర శివారులోని రాళ్లవాగు ఉప్పొంగి సమీప కాలనీలను ముంచెత్తుతోంది. నాలుగు రోజులుగా ఎన్టీఆర్ నగర్, రాంనగర్, పద్మశాలి కాలనీ, ఆదిత్య ఎంక్లేవ్, పాత మంచిర్యాల, రెడ్డి కాలనీ, రాళ్లపేట్ వంటి ప్రాంతాలు ముంపు అంచున నిలిచాయి. ఈ సమయంలో నిద్ర, ఆహారం లేకుండా, వరద ఇళ్లలోకి వస్తుందేమో అని భయం భయంగా గడిపారు. ఆదివారం వరద కాస్త తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరోసారి వర్షాలు కురిస్తే ముంపు తీవ్రత పెరుగుతుందని ఆందోళన చెందుతున్నారు.

నీళ్లు ఎదురెక్కి..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం తర్వాత గోదావరి నదిలోకి వచ్చిన వరద రాళ్లవాగు నుంచి సమీప కాలనీలకు ఎదురెక్కుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు తెరిచి నీటిని దిగువకు వదిలినప్పుడు, రాళ్లవాగులోని నీరు గోదావరిలోకి వెళ్లలేక, వెనక్కి తిరిగి సమీప కాలనీల్లోకి చేరుతోంది. 2022లో భారీ వర్షాల సమయంలో ఈ ప్రాంతాలు తీవ్రంగా మునిగాయి. ఈ ఏడాది కూడా ఎగువ ప్రాంతాల వర్షాలతో గోదావరి నీరు రాళ్లవాగులోకి చేరి, ఎన్టీఆర్ నగర్, రాంనగర్, పద్మశాలి కాలనీలు నీటమునిగాయి. వర్షం లేకపోయినా, రాళ్లవాగు ద్వారా వరద నీరు చేరడంతో ముంపు కష్టాలు తప్పడం లేదు.

కరకట్ట నిర్మాణానికి రూ.255.59 కోట్లు..

ముంపు సమస్యకు చెక్ పెట్టేందుకు రాళ్లవాగుపై కరకట్ట(రిటైనింగ్ వాల్) నిర్మాణానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, రూ.255.59 కోట్ల నిధులను విడుదల చేయించారు. ఈ ఏడాది బీఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కరకట్ట నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్, గౌతమినగర్, రెడ్డి కాలనీ, రాంనగర్, ఎన్టీఆర్ నగర్, ఆదిత్య ఎంక్లేవ్, పద్మశాలి కాలనీ, గ్రీన్‌సిటీ, రంగంపేట, పాత మంచిర్యాల ప్రాంతాలకు రక్షణగా 60–100 మీటర్ల వెడల్పు, 6 కిలోమీటర్ల పొడవున్న కరకట్ట నిర్మాణం ప్రణాళికాబద్ధంగా సాగుతోంది. జేసీబీలతో చదును చేసే పనులు ప్రారంభమైనప్పటికీ, వర్షాకాలం కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయాయి.

వచ్చే వానాకాలం నాటికి..

వర్షాకాలం ముగిసిన వెంటనే కరకట్ట నిర్మాణం ప్రారంభించి, వచ్చే ఏడాది వర్షాకాలానికి ముందు పూర్తి చేయాలని ముంపు బాధితులు కోరుతున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే, రాళ్లవాగు ద్వారా వచ్చే వరద నీటి నుంచి సమీప కాలనీలకు రక్షణ లభిస్తుందని ఆశిస్తున్నారు. ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుని, ఈ దీర్ఘకాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

కొట్లాడితేనే కొత్త గనులు

- సొంతింటి పథకం సాధించాలి
- మాజీ మంత్రి వేణుగోపాలాచారి
- ముగిసిన హెచ్‌ఎంఎస్ మహాసభలు
- గౌరవ అధ్యక్షురాలిగా కవిత ఎన్నిక



మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణుగోపాలాచారి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికవర్గం కొట్లాడితేనే కొత్త గనులు వస్తాయని.. అప్పుడే సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎంఎస్ నేత, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి తెలిపారు. రెండు రోజులుగా నస్పూర్ పట్టణంలోని గోదావరి ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ 26వ ద్వైపాక్షిక మహాసభలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల పక్షాన పోరాడి సొంతింటి పథకం సాధించాలన్నారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం సాధించిన వార్షిక లాభాల నుంచి 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఈసారి 10 శాతం వాటా చెల్లించాలన్నారు. బొగ్గు గనుల వేలంతో సింగరేణి భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వేలం నిలిపివేసి తెలంగాణలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్‌చేశారు. పెర్క్స్‌పై ఆదాయ పన్ను సింగరేణి యాజమాన్యమే చెల్లించాలన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని దీనిని రూపుమాపాలన్నారు. మారుపేర్ల సమస్య పరిష్కరించాలన్నారు. ఇప్పటివరకు సింగరేణి మైనర్స్ అండ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్‌గా ఉన్న పేరును ఇక నుంచి అఖిల భారత మైనర్స్ అండ్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్‌గా మార్చుతున్నట్టు హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు.

గౌరవ అధ్యక్షురాలిగా కవిత..

మహాసభల్లో భాగంగా యూనియన్ గౌరవ అధ్యక్షురాలిగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇకపై ఆమె యూనియన్ గౌరవ ప్రదమైన స్థానంలో కొనసాగుతారన్నారు. ఈ సభకు ముందుగా ఇందారం చౌరస్తా నుంచి మహాసభల వేదిక వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జెండా ఆవిష్కరించిన అనంతరం మహాసభలను కొనసాగించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, నాయకులు జమీల్, యూనియన్ కేంద్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.అనిల్‌రెడ్డి, మందమర్రి ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్, బెల్లంపల్లి ఉపాధ్యక్షుడు రాజబాబు, శ్రీరాంపూర్ డివిజన్ నాయకులు పొన్నగంటి అశోక్, గొల్ల సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, దుర్గం లక్ష్మణ్, రేకుంట సందీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక డంప్ సీజ్



ఇసుక డంప్ వద్ద ఆర్ఐ యజువేందర్‌రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని రణదివే నగర్ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను అధికారులు ఆదివారం సీజ్ చేశారు. తమకు అందిన సమాచారం మేరకు ఆర్ఐ యజువేందర్ రెడ్డి, మైనింగ్ శాఖ టీఏ రమేశ్, పోలీసులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. అందుకు సంబంధించిన యజమానులెవరూ ముందుకు రాకపోవడంతో ఇసుకను సీజ్ చేసి కలెక్టరేట్‌కు తరలించారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టినా, నిల్వ చేసినా తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

జన్నారం: రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన దుమల్ల రాజ్‌కుమార్ (26) జూన్ 16న ధర్మపురి మండలం నేరెల్ల గుట్టల నుంచి వస్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. 75 రోజులపాటు చికిత్స అందించినా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు.

డ్రెయినేజీలో పడి ఒకరు..



సంతోష్(ఫైల్)

భైంసాటౌన్: డ్రెయినేజీలో పడి ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. లోకేశ్వరం మండలం పుస్పూర్ గ్రామానికి చెందిన ఒరగంటి సంతోష్ (26) మూడురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం పట్టణంలోని ఐబీ ప్రాంతంలో డ్రెయినేజీ నుంచి దుర్వాసన రావడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించగా మృతదేహం కనిపించడంతో ఏరియా ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీ.గోపినాథ్ తెలిపారు.

స్నానానికి వెళ్లి విద్యార్థి..



రాథోడ్ అంకిత్ (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: స్నానానికి వెళ్లి నీటమునిగి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి చదువుతున్న రాథోడ్ అంకిత్ (15) ఆదివారం సెలవుదినం కావడంతో మరో ఇద్దరు స్నేహితులతో కలిసి కోసిని డ్యాంను చూసేందుకు వెళ్లారు. మిగితా ఇద్దరు ఒడ్డుపై ఉండగా అంకిత్ స్నానం చేసేందుకు డ్యాంలోకి దిగాడు. అయితే తూము సమీపంలో లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో గల్లంతయ్యాడు. గమనించిన స్నేహితులు గ్రామస్తులతో పాటు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ బృందంతో పాటు గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని తండ్రి మోహన్ మండలంలోని నజ్రుల్‌నగర్‌విలేజ్ నెం 5 ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. సంఘటన స్థలాన్ని కాగజ్‌నగర్ సీఐ కుమారస్వామి, ఎంపీడీవో కోట ప్రసాద్ పరిశీలించారు. మృతుని తండ్రి మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తప్పిన ప్రాణాపాయం



నది ప్రవాహం నుంచి బయటపడ్డ మల్లయ్య

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామానికి చెందిన వలస కూలీ మాదస్తు మల్లయ్య ఆదివారం గోదావరి నీటి ప్రవాహాన్ని చూసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి కొట్టుకుపోయాడు. అతనికి ఈత రావడంతో ఈదుకుంటూ తిరిగి ఒడ్డుకు చేరుకుని ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ప్రజలు గోదావరి వైపు వెళ్లి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఆర్‌కేపీలో సైబర్ మోసం

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదిల్‌పేట్ గ్రామానికి చెందిన ఓ యువకుడు సైబర్ మోసగాళ్ల చేతిలో రూ.70వేలు పోగొట్టుకున్నాడని పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వర్క్ ఇండియా పేరిట పార్ట్‌టైం జాబ్ ఉందని ఓ లింక్ పంపి దానికి రివ్యూస్ ఇస్తూ స్క్రీన్ షాట్ చేసి పంపితే రోజుకు కొంత నగదు జమ అవుతుందని చెప్పారని, ఇందుకుగాను సభ్యత్వం కోసం రూ.70వేలు చెల్లించాలని చెప్పడంతో నాలుగు విడతల్లో పంపించి మోసపోయాడని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పది రోజుల్లో ఛేదించారు!

- చెన్నూర్ ఎస్‌బీఐలో రూ.13.71 కోట్ల కుంభకోణం..
- నగలు, నగదు మాయం కేసులో 44 మంది అరెస్ట్..
- ఇంటి నుంచే మొదలైన మోసం..
- పక్కా ప్రణాళికతో కోట్లల్లో కొల్లగొట్టిన క్యాషియర్



నిందితులను తీసుకువస్తున్న పోలీసులు

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్–2లో జరిగిన రూ.13.71 కోట్ల భారీ మోసాన్ని పోలీసులు కేవలం పది రోజుల్లో ఛేదించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. బ్యాంక్ క్యాషియర్ నరిగే రవీందర్ 25.17 కిలోల బంగారు ఆభరణాలు, రూ.1.10 కోట్ల నగదు, అలాగే 42 నకిలీ బంగారు రుణాల ద్వారా రూ.1.58 కోట్లను కాజేశాడు. ఈ మోసం ఆగస్టు 23న బ్యాంక్ ఆడిట్ సమయంలో బయటపడగా, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రితేష్ కుమార్ గుప్తా ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. రవీందర్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు కోల్పోయి, నష్టాలను భర్తీ చేసేందుకు బ్యాంక్ మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌తో కలిసి ఈ మోసాన్ని సుమారు పది నెలల పాటు కొనసాగించాడు.

సాంకేతికతతో నిందితుడి అరెస్ట్

మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో పది పోలీసు బృందాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రధాన నిందితుడు రవీందర్‌ను ట్రాక్ చేశాయి. రవీందర్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినప్పటికీ, పోలీసులు వేములవాడలో అతను దైవదర్శనం చేసుకున్నట్లు గుర్తించారు. ఆగస్టు 26న జైపూర్ మండలం షెట్‌పల్లిలోని స్వగ్రామానికి చేరుకున్న రవీందర్, మరుసటి రోజు నాగ్‌పూర్‌కు పారిపోయే ప్రయత్నంలో ఇందారం క్రాస్‌రోడ్ వద్ద పోలీసులకు చిక్కాడు. అతనితో పాటు 44 మంది నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, ఎస్‌బీఎఫ్‌సీ, ఇండెల్ మనీ, గోదావరి అర్బన్, ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం వంటి ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల నుంచి 15.23 కిలోల బంగారు ఆభరణాలు, రూ.1.61 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన బంగారం రికవరీకి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల పాత్రపై దర్యాప్తు..

ఎస్‌బీఐ నుంచి కాజేసిన బంగారాన్ని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు అనుమానాస్పద రీతిలో తాకట్టుకు స్వీకరించడంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ సంస్థల మేనేజర్ల పాత్రను కూడా పరిశీలిస్తున్నారు. ఎందుకంటే రవీందర్ తన భార్య, బంధువులు, స్నేహితుల పేరిట నకిలీ ఖాతాలు సృష్టించి బంగారాన్ని తాకట్టు పెట్టాడు. ఈ మోసంలో కొందరు సంస్థలు కమీషన్ ఆధారంగా సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

పోలీసుల చాకచక్యానికి ప్రశంసలు..

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో ఈ కేసును వేగంగా ఛేదించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు, రూరల్ సీఐ బన్సీలాల్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, మంచిర్యాల సీఐ అశోక్, నరేష్ కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బాబురావు తదితరులను అభినందించారు. నిందితులను రామగుండం నుంచి చెన్నూర్‌కు తరలించి, వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో మొదలై...

రవీందర్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు కోల్పోవడంతో ఈ మోసానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. బాసర ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేసి టాపర్‌గా నిలిచిన రవీందర్, 2017లో ఎస్‌బీఐలో క్యాషియర్‌గా చేరాడు. అయితే, తన విద్య, పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోకుండా, బెట్టింగ్ అలవాటుతో బ్యాంక్ నుంచి 402 ఖాతాలకు సంబంధించిన 20.496 కిలోల బంగారాన్ని, రూ.1.10 కోట్ల నగదును కాజేశాడు. తన భార్య, బంధువులు, స్నేహితుల పేరిట 42 నకిలీ రుణాల ద్వారా రూ.1.58 కోట్లను సమకూర్చాడు. ఈ మొత్తం బెట్టింగ్‌లోనే ఖర్చయిందా లేక ఇతర కారణాలు ఉన్నాయా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

బాధితుల సంబరాలు



చెన్నూర్ ఎస్‌బీఐ ఎదుట సంబరాలు జరుపుకుంటున్న బాధితులు

పోలీసులు 75 శాతం బంగారాన్ని (15.23 కిలోలు) రికవరీ చేయడంతో, ఎస్‌బీఐ గోల్డ్ లోన్ బాధితులు చెన్నూర్ బ్యాంక్ ఎదుట బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పోలీసుల చాకచక్యాన్ని అభినందిస్తూ, తమ నష్టాన్ని తగ్గించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌తోపాటు మంచిర్యాల, బెల్లంపల్లిలో పలు వీక్లీరైళ్లకు సెప్టెంబర్‌లో హాల్టింగ్ సదుపాయం కల్పించినట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు. కాన్పూర్ నుంచి ఎస్ఎంవీటీ బెంగళూరు నుంచి కాన్పూర్ మధ్య వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (04131/32) రైలు సెప్టెంబర్ 14 నుంచి నవంబర్ 14 వరకు, బిలాస్‌పూర్ నుంచి ఎలహంకా (బెంగళూరు) నుంచి బిలాస్‌పూర్‌ల మధ్య వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (08262/61) రైలు సెప్టెంబర్ 9 నుంచి నవంబర్ 21 వరకు నడుస్తాయని వారు పేర్కొన్నారు. వీటికి మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ ఉంటుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వర్ణ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

సారంగపూర్: ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండడంతో అప్రమత్తమైన అధికారులు రెండు వరదగేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు నీటిమట్టం 1,183 అడుగులు కాగా 5200ల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి అంతే మొత్తం నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 1182.1 అడుగుల వద్ద స్థిరంగా ఉంచినట్లు ఏఈ మధుపాల్ తెలిపారు.

రక్షణలో అధికారులకు చిత్తశుద్ధి లేదు

- సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

శ్రీరాంపూర్: కార్మికుల రక్షణలో అధికారులకు చిత్తశుద్ధి లేదని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఆరోపించారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 55వ రక్షణ త్రైపాక్షిక సమావేశంలో రక్షణ మెరుగుపరిచేలా నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సేఫ్టీ సమావేశాలకు జేబీసీసీఐలోని అన్ని కార్మిక సంఘాలను పిలవాలన్నారు. కోలిండియాలో జేబీసీసీఐ సంఘాలన్నింటినీ భాగస్వామ్యం చేస్తున్నారని సింగరేణిలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. గెలిచిన సంఘాలను యాజమాన్యానికి అనుకూలంగా మలుచుకొని రక్షణను ఉల్లంఘిస్తున్నారన్నారు. గనుల్లో సర్వే ఆఫ్ అయిన ఎస్‌డీఎల్ యంత్రాలను నడిపిస్తున్నారని ప్రమాదాలు జరిగితే రిపోర్టులు కూడా రాయడం లేదన్నారు. పైగా ప్రైవేటుకు వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచిస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు సింగరేణిలో నిత్యం జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల రిపోర్టుల సంఖ్యను తగ్గించుకునేందుకు ఈ కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రక్షణకు ప్రాధాన్యతనిస్తున్నామని మాటల్లో చెబుతున్న అధికారులు ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. శిక్షణ ఇవ్వకుండానే కార్మికులకు పనులు కేటాయిస్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నారన్నారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్ నాయకులు రాజేందర్, శ్రీనివాస్, ఎం శ్రీధర్, బానేష్, సదానందం, కిషన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



గోల్డ్ మెడల్ సాధించిన అశ్వినితో కోచ్ రాకేశ్



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ రమేశ్

ఆదిలాబాద్: మహబూబ్‌నగర్‌లో ఆగస్టు 30, 31 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆదివారం జిల్లా క్రీడాకారులు నాలుగు పతకాలు సాధించారు. జిల్లాకు చెందిన అశ్విని అండర్–20 విభాగంలో హైజంప్ ఈవెంట్లో స్వర్ణ పతకం సాధించినట్లు కోచ్ రాకేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గల ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడు పతకాలు సాధించారు. ట్రయాథ్లాన్ ఎస్.చరణ్ రజతం, జావెలిన్‌త్రో ఈవెంట్లో వి. మహేష్ కాంస్యం, 80 మీటర్ల హార్డిల్స్ ఈవెంట్లో పీ.స్వాతి కాంస్య పతకం సాధించినట్లు అథ్లెటిక్స్ కోచ్ రమేశ్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, రాజేశ్, తదితరులు అభినందించారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



పవార్ విష్ణు(ఫైల్)

కుంటాల: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని మెదన్‌పూర్ గ్రామానికి చెందిన పవార్ విష్ణు (28) శనివారం ఇంట్లోనుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆదివారం మధ్యాహ్నం గ్రామ శివారులో పడిపోయి ఉండడాన్ని గమనించిన పశువుల కాపరి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మద్యానికి బానిసై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని వివరించారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని తండ్రి బంకట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

‘కుంటాల’ వద్ద పర్యాటకుల సందడి



కుంటాల జలపాతం వద్ద కుప్టి గ్రామస్తులు

నేరడిగొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కుంటల జలపాతం పరవళ్లు తొక్కుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో పర్యాటకులు జలపాతం అందాలను వీక్షించి మంత్రముగ్ధులయ్యారు. మండలంలోని కుప్టి గ్రామస్తులు జలపాతం వద్దకు చేరుకొని సందడి చేశారు. ప్రకృతి అందాలను ఆస్వాదించారు. జలపాతం వద్ద సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు.

20 యూరియా బస్తాలు స్వాధీనం

భీమిని: మండలంలోని వడాల గ్రామ శివారులో ఆదివారం అక్రమంగా వాహనంలో తరలిస్తున్న 20 యూరియా బస్తాలను వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. వడాల గ్రామ శివారులోని జగ్గయ్యపేటలో బి.సతీష్ కు చెందిన బాలాజీ ట్రేడర్స్ నుంచి 20 యూరియా బస్తాలను వాహనంలో తరలిస్తుండగా మండల వ్యవసాయ అధికారి యమునా దుర్గా వ డాల గ్రామ శివారులో బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఫర్టిలైజర్ యజమానిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కడెం ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత



కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు ఆదివారం 4,712 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ప్రాజెక్ట్ అధికారులు ఒక వరద గేటు ఎత్తి 5,992 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 698.250 అడుగుల నీటిమట్టం ఉంది.

18 టీఎంసీలకు చేరిన ‘ఎల్లంపల్లి’



గోదావరిలో కలుస్తున్న వరదనీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నాలుగు రోజులుగా ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి భారీగా నీటిని విడుదల చేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిమట్టం ఏకంగా 13 టీఎంసీలకు పడిపోయింది. అయితే ఆదివారం 40 గేట్ల నుంచి 21 గేట్లకు కుదించి నీటిని విడుదల చేస్తుండగా 18 టీఎంసీల నీటిమట్టానికి చేరింది. ఇన్‌ఫ్లో కింద 3.30 లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతుండగా అవుట్‌ఫ్లో కింద అంతే క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

సీపీఎస్ అంతమే పంతం

- ఉద్యోగ, ఉపాధ్యాయుల సమరభేరి
- నేడు హైదరాబాద్ సభకు తరలేందుకు సర్వంసిద్ధం..



నిర్మల్‌లో పెన్షన్ విద్రోహదినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగసంఘాల జేఏసీ నాయకులు

నిర్మల్‌ఖిల్లా: నాలుగు దశాబ్దాల పాటు ఉద్యోగ విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన తర్వాత ఎంతోకొంత సాంత్వన చేకూర్చేది పెన్షన్.. కానీ సీపీఎస్ ఉద్యోగుల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఉద్యోగ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తూ వస్తున్న ప్రధాన అంశం సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) రద్దు.. తమ భవిష్యత్ భద్రత కోసం పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 1న ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభకు ఉమ్మడి జిల్లా నుంచి తరలివెళ్లేందుకు కార్యాచరణ రూపొందించుకున్నారు.

ఏమిటీ సీపీఎస్...

ఉద్యోగ జీవిత కాలంలో దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా పనిచేసి చివరలో భవిష్యత్తు అనిశ్చితిపై ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి పెన్షన్ పొందడం వృద్ధాప్యంలో తగిన స్థిరమైన ఆదాయం లేకపోవడం పాత పెన్షన్ విధానం మాదిరి కుటుంబ భద్రత లభించకపోవడం తమను ఆవేదనకు గురిచేస్తోందని సీపీఎస్ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ‘సీపీఎస్ రద్దు– ఓపీఎస్ అమలు’ నినాదం రాష్ట్రవ్యాప్తంగా మారుమోగుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఉద్యోగులు ఉపాధ్యాయులు సైతం ఇందులో భాగస్వాములు అయ్యేందుకు నేటి సభకు సన్నద్ధమయ్యారు. 2004లో కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానం స్థానంలో సీపీఎస్ ప్రవేశపెట్టింది. ఇందులో ఉద్యోగుల జీతం నుంచి కొంత శాతం కోత విధించి పెన్షన్ ఫండ్‌లో జమ చేస్తారు. ఉద్యోగ విరమణ అనంతరం ఈ ఫండ్ నుంచి మార్కెట్ పరిస్థితి ఆధారంగా వారికి పెన్షన్ లభిస్తుంది. సీపీఎస్ విధానం ద్వారా ఆర్థిక సామాజిక భద్రత లేకపోవడంతో సీపీఎస్ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి రేకెత్తిస్తోంది.

ఓపీఎస్ పునరుద్ధరణ డిమాండ్..

ఓల్డ్ పెన్షన్ స్కీమ్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్ ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల్లో వినిపిస్తోంది. ఆయా సంఘాల జేఏసీ రాష్ట్రస్థాయి నాయకుల ఆదేశాల మేరకు అన్ని జిల్లాల నుంచి సభకు హాజరుకావడంలో భాగంగా నిర్మల్ జిల్లా ఉద్యోగులు సైతం తరలి వెళ్ళనున్నారు. ఎన్నికల సమయంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామంటూ హామీలు గుప్పిస్తున్న అమలులో మాత్రం స్పష్టత లేకపోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాల్లో నిరసన వ్యక్తమవుతోంది. సీపీఎస్ రద్దు డిమాండ్ కేవలం ఉద్యోగుల సమస్య మాత్రమే కాదని, వారి కుటుంబ భవిష్యత్ భద్రతకు సంబంధించిన అంశమని జేఏసీ నాయకులు స్పష్టం చేస్తున్నారు.

నిర్మల్‌జిల్లాలో ఇలా...

ఖజానా శాఖ లెక్కల ప్రకారం నిర్మల్ జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ సబ్‌ట్రెజరీ కార్యాలయాల పరిధిలో 7,150 మంది ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులుండగా వీరిలో దాదాపు 4వేలకు పైగా సీపీఎస్ ఉద్యోగులే ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

తరలివెళ్లేందుకు సమాయత్తం

హైదరాబాద్‌లో నేడు నిర్వహించనున్న బహిరంగసభకు ఉమ్మడి జిల్లాలోని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, తదితర సిబ్బంది వివిధ వాహనాల్లో రాజధాని బాట పట్టేందుకు సమాయత్తమవుతున్నారు. రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో నేడు భారీ బహిరంగసభ నిర్వహించనుండగా ప్రధాన ఉపాధ్యాయుల సంఘం పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కులో మహాధర్నా నిర్వహించనున్నారు. మహాధర్నాకు ఉపాధ్యాయులంతా నల్లరంగు దుస్తులు ధరించి హాజరుకానున్నట్లు సంఘం నాయకులు పేర్కొంటున్నారు. మరోవైపు దూరభారం వల్ల హాజరుకాలేని సీపీఎస్ ఉద్యోగులు జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. మహాధర్నా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల ఐక్యతను ప్రదర్శించే వేదిక కానున్నట్లు నాయకులు స్పష్టం చేస్తున్నారు.

ఆర్థిక భద్రత కరువు..



సీపీఎస్ విధానంతో వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కరువవుతోంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా పునరాలోచన చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలి. 20 ఏళ్ల క్రితం తీసుకువచ్చిన ఈ విధానం ప్రభుత్వ ఉద్యోగులపై గుదిబండగా మారింది.

– వెల్మల ప్రభాకర్, టీఎన్జీవో అధ్యక్షుడు, నిర్మల్

పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలి



పిల్లల భవిష్యత్, కుటుంబ భద్రత కోసం పాత పింఛన్ విధానాన్ని అమలులోకి తేవాలి. ప్రభుత్వం ఇప్పటికైనా సాధ్యమైనంత త్వరగా ఓపీఎస్ విధానాన్ని అమలుపరచాలి. ఇదే ప్రధాన డిమాండ్‌గా సీపీఎస్ ఉపాధ్యాయుల గొంతుకను వినిపించనున్నాం. మహాధర్నా ద్వారా ఐక్యత చాటుతాం.

– తోట నరేంద్రబాబు, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు, నిర్మల్

హామీ నెరవేర్చాలి



పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా సీపీఎస్ ఉద్యోగుల సంఘంతో పాటు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ, పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ఉద్యోగ, ఉపాధ్యాయులపై ఉంది. సీపీఎస్ వల్ల రెండు లక్షల పైచిలుకు మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల సామాజిక, ఆర్థిక భద్రతకు ముప్పు వాటిల్లుతోంది. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ నెరవేర్చాలి.

– కృష్ణారావు, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, నిర్మల్

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడేసిన వస్తువులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రాజంపేటలో శనివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు రాజంపేటలో నివాసం ఉంటున్న బీరెల్లి సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి పెద్దపల్లి జిల్లాలోని సుందిళ్లకు వెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి అందులోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ బాలాజీ వరప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బీరువాలో ఉన్న 20 తులాల బంగారం చోరీకి గురైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.

దూడపై కుక్కల దాడి



గాయాలపాలైన దూడ

నిర్మల్: నర్సాపూర్ (జి) మండల కేంద్రానికి చెందిన నాగభూషణ్ అనే పాడి రైతు గేదె ఇటీవల దూడకు జన్మనిచ్చింది. ఆదివారం ఉదయం కుక్కల గుంపు దూడను వెంబడించి పలుచోట్ల గాయపరిచాయి. అధికారులు స్పందించి కుక్కల బెడదని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వలకు చిక్కి విలవిల

జిల్లా కేంద్రం సమీపంలోని అక్కాపూర్ గ్రామ చెరువు మత్తడివద్ద ఆదివారం గ్రామస్తులు వేసిన చేపల వలలో పెద్ద కొండచిలువ చిక్కింది. శాంతినగర్ కాలనీకి చెందిన స్నేక్ క్యాచర్ గిరిగంటి అనిల్‌కు సమాచారం అందించడంతో వలను కత్తిరించి కొండచిలువను బంధించాడు. అనంతరం 8 అడుగులున్న పెద్ద కొండచిలువను సురక్షితంగా వల నుండి బయటకు తీసి సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. వర్షాకాలం నేపథ్యంలో చెరువుల వద్ద పాములు సంచరిస్తుంటాయని, పశువులకు, మానవులకూ హాని జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్నేక్ క్యాచర్ అనిల్ సూచించారు.

– నిర్మల్‌ఖిల్లా



వలకు చిక్కిన భారీ కొండచిలువ ఇదే



సింగరేణి రక్షణ పక్షోత్సవాలు

సింగరేణి 55వ రక్షణ పక్షోత్సవాల బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమం మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలోని ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి డీజీఎంఎస్ ఉజ్వల్ థాతో కలిసి సీఎండీ బలరాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి.

– రామకృష్ణాపూర్





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎండీ, డీజీఎంఎస్